నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, బుధవారం 26 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

# కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- పదిహేను నెలల కాలంలోనే తేటతెల్లం
- మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ, మార్చి 25 : రాష్ట్రాన్ని పరిపాలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పదిహేను నెలల కాలంలోనే ఆ విషయం తేటతెల్లమైందని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు విమర్శించారు. పాల్వంచలోని ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, తాను ఎందరో ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్‌లాంటి ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. రేవంత్‌రెడ్డి తన స్థాయిని మర్చిపోయి దిగజారుడుతనంగా మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మంత్రులు ఒక మాట, ఎమ్మెల్యేలు ఒక మాట, సీఎం ఒక మాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళంలోకి నెట్టి వేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సమావేశంలో వనమా రాఘవేందర్‌రావు, కాపు సీతాలక్ష్మి, మంతపురి రాజుగౌడ్, కాంపెల్లి కనకేష్ పటేల్, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరాంమూర్తి, కనగాల బాలకృష్ణ, మల్లెల రవిచంద్ర, కొత్వాల సత్యం, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాష్, భూక్యా చందునాయక్, సమ్మయ్య గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజుల, తెలంగాణ గిరి, నామా నవీన్, కుంపటి శివ, భూక్యా వీరన్న పాల్గొన్నారు.

# ఆగ్రహించిన ఆశాలు..

- ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరసనల గళం
- పలు చోట్ల సీఎం రేవంత్ దిష్టిబొమ్మల దహనం

ఖమ్మం, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయ ముట్టడికి వెళ్లి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత ధోరణిని ప్రదర్శించింది. వారిని అరెస్టు చేసింది. వారి అక్రమ అరెస్టులను ఖండిస్తూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వాప్తంగా మంగళవారం నిరసనలకు దిగారు. పలు మండలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపహాడ్, దుమ్ముగూడెం, కారేపల్లి, ఖమ్మం రూరల్, బోనకల్లు మండల కేంద్రాల్లో ప్ల కార్డులతో ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని ఆందోళన బాట పడితే ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడం, పోలీస్‌స్టేషన్లకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో ఉద్యమబాట పట్టినట్లు నాయకులు పేర్కొన్నారు.




అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశా కార్యకర్తలు



తునికాకు సేకరణ చేసి కట్టలు కడుతున్న గిరిజన కుటుంబాలు (ఫైల్)

# ఉ(తు)నికి కోల్పోతోంది..

## రేటు పెరగదు.. బోనస్ రాదు

మండుటెండలో తునికాకు సేకరిస్తున్న గిరిజనుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు. గిరిజనుల మూడోపంటగా ఉన్న తునికాకు సేకరణ రానురాను దూరాభారం, కష్టతరం అవుతున్నది. ఒకవైపు పోడు ద్వారా కొంత అడవి దూరం కాగా.. మరోవైపు ఓసీ పేరుతో అటవీ భూమి సింగరేణిపరం కావడంతో గిరిజనులకు తునికాకు సేకరణ తలకు మించిన భారంగా మారింది. అడవిలో ఆకు సేకరణకు కష్టాలు తప్పడం లేదు. వేసవిలో చాలాదూరం నడిచి వెళ్తే తప్ప ఆకులు దొరికే పరిస్థితి లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సరైన రేటు లేకపోవడం, ఏటా బోనస్ సొమ్ములు కూడా రాకపోవడంతో గిరిజనులు ఆకు సేకరణపై ఆసక్తి చూపడం లేదు. చివరకు తునికాకు ఉనికి కోల్పోయే పరిస్థితులు దాపురించాయి. ధర్నాలు చేసినా ఫలితం లేకుండా పోతున్నదని గిరిజన సంఘాలు, రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 25
(నమస్తే తెలంగాణ)

- తునికాకు కార్మికులకు దక్కని ప్రతిఫలం
- గిరిజనులకు దూరమవుతున్న మూడో పంట!
- ఓసీ పేరుతో అటవీ భూమి సింగరేణిపరం
- తునికాకు కోసం సరిహద్దులు దాటాల్సిందే..
- జిల్లాలో 32,600 స్టాండర్డ్ బస్తాల లక్ష్యం



ప్రూనింగ్ పనులు చేశాక చిగురిస్తున్న తునికి ఆకులు

ఏటికేడాది గిరిజనులు ఎంతో కష్టపడి తునికాకు సేకరిస్తుంటే వారి రెక్కల కష్టానికి సరైన రేటు లేకపోవడంతో అడవిలో కాలినడక వృథాగానే మిగిలిపోతున్నది. మైళ్లదూరం వెళ్లి ఆకు సేకరణ చేస్తే కనీసం కూలిమందం కూడా సొమ్ములు వచ్చే పరిస్థితి లేకపోవడంతో తునికాకు కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 చొప్పున ఇచ్చారు. గతంలో కూడా అదే పరిస్థితి.. ఈ ఏడాది రేటు పెంచాలని డిమాండ్ చేసినా అటవీ శాఖ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరం. దీంతోపాటు కార్మికులకు రావాల్సిన బోనస్ కూడా కొంత కాలంగా రాకపోవడంతో తమ కష్టానికి ఫలితం దక్కడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 25 వేల మంది తునికాకు కార్మికులు ఏటా తునికాకు సేకరిస్తున్నారు. వీరందరికీ ఏటా ఆకు సేకరణ అమ్మకాల ద్వారా వచ్చే లాభాల్లో రూ.11 నుంచి రూ.12 కోట్ల బోనస్ రావాల్సి ఉంటుంది. 2021 వరకు కార్మికులకు బోనస్ ఇచ్చారు. కానీ.. అప్పటినుంచి కొత్త సర్కారు ఆ మాట ఎత్తడం లేదు.

### ఓసీ పేరుతో అటవీ భూమి సింగరేణిపరం

గిరిజన జిల్లాలో ఎక్కువగా ఉండాల్సిన అడవి రానురాను కనుమరుగవుతున్నది. పోడు ద్వారా కొంత అడవిపోగా, మరోవైపు ప్రభుత్వమే అటవీ భూమిని తీసుకోవడం వల్ల అటవీ సంపద తగ్గిపోతున్నది. ఇల్లెందు నియోజకవర్గంలో ఓపెన్‌కాస్టు కోసం సింగరేణి అటవీ భూమిని తీసుకుంది. దీంతో అక్కడ అటవీ సంపద కనుమరుగైంది. దీంతోపాటు భూసారం కూడా తగ్గిపోవడంతో తునికి చెట్లు మాయమైపోతున్నాయి. దుమ్ముగూడెం ప్రాంతంలో అడవి తగ్గిపోవడంతో అక్కడ గిరిజనులు తునికాకు కోసం రాష్ట్ర సరిహద్దులు దాటాల్సి వస్తున్నది. మైళ్ల దూరం నడిచి వెళ్లినా కార్మికులకు ఫలితం దక్కడం లేదు.

### 32,600 స్టాండర్డ్ బస్తాల లక్ష్యం

జిల్లాలో ఆరు డివిజన్ల ద్వారా 39 యూనిట్లలో తునికాకు సేకరణ చేస్తున్నారు. మొత్తం 32,600 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా ఉంది. మణుగూరు డివిజన్‌లోని 5 యూనిట్లలో 5,400 బస్తాలు, పాల్వంచ 4 యూనిట్లలో 2,300, ఇల్లెందు 8 యూనిట్లలో 10,600, కిన్నెరసాని 5 యూనిట్లలో 3,200, భద్రాచలం 5 యూనిట్లలో 9,700, కొత్తగూడెం 2 యూనిట్లలో 1,400 బస్తాలు సేకరించనున్నారు.



### ఆకులు దొరకడం లేదు..



తునికాకు సేకరణ చాలా కష్టంగా మారింది. ప్రూనింగ్ పనులు సమయానికి చేయకపోవడం వల్ల కూడా ఆకులు చిగురించడం లేదు. కాలబెట్టడం వల్ల చెట్లు మోడుగా మారిపోతున్నాయి. సమయానికి వానలు పడకపోవడంతో మోడు చిగురించడం లేదు. గతంలో బోనస్ డబ్బులు రాలేదు. రేటూ పెరగడం లేదు. తునికాకు సేకరణపై ఆసక్తి తగ్గిపోతున్నది.
– వీరాస్వామి, తునికాకు కార్మికుడు, ముత్తారం, గుండాల మండలం

### 15 రోజుల్లో సేకరణ ప్రారంభిస్తాం..



జిల్లాలో ఇప్పుడే ప్రూనింగ్ పనులు పూర్తిచేశాం. మొత్తం 39 యూనిట్లలో ఆకు సేకరణ జరుగుతుంది. వచ్చే నెల 15వ తేదీ నుంచి తునికాకు సేకరణ చేస్తారు. ప్రస్తుతం తునికాకు కట్ట రూ.3 ఉంది. పెంచడానికి ప్రతిపాదన చేశాం. కార్మికుల ఖాతాల్లోనే బోనస్ జమ అవుతుంది. జిల్లాలో 32,600 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా ఉంది.
– కృష్ణగౌడ్, డీఎఫ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం

# కేసీఆర్, కేటీఆర్‌ల కృషితోనే.. ఖమ్మం అభివృద్ధి

- కేఎంసీ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు
- ఆదాయం పెంచుకునేందుకు కృషి: కలెక్టర్
- రూ.188 కోట్లతో 'నగర పాలక' బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మార్చి 25:గత ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ల కృషి, సహకారం వల్లనే ఖమ్మం నగరం శరవేగంగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం కూడా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ (కేఎంసీ) కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత ఖమ్మం పట్టణ రూపురేఖలు మారిపోయాయని గుర్తుచేశారు. ప్రతి డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల సమాచారం సంబంధిత ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా అందించాలని కోరారు.

**రూ.188.31 కోట్లతో బడ్జెట్..**

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.188.31 కోట్లతో కేఎంసీ బడ్జెట్ ఆమోదం పొందినట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాలు, ఆదాయం, ఖర్చుల వివరాలు, 2024-25 సవరించిన బడ్జెట్ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేఎంసీలో ఆస్తి పన్ను, ఇతర పన్నులు రీ అసెస్‌మెంట్ చేసి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వరదలు వచ్చిన ప్రాంతాల్లో ఆస్తి పన్ను సడలింపునిచ్చి పాలకవర్గం మంచి నిర్ణయం తీసుకుందని కలెక్టర్ అభినందించారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా కూడా కేఎంసీకి ఆదాయం వస్తుందని, దానిని సక్రమంగా వినియోగించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. టౌన్ ప్లానింగ్, అద్దెలు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయ మార్గాలు పెంచుకోవాలని సూచించారు. అలాగే, గతంకంటే ఇప్పుడు 25 శాతం ఆదాయం పెరిగిందని అన్నారు.

**ప్రొటోకాల్‌పై తాతా మధు ఆగ్రహం**

ప్రజాప్రతినిధుల పట్ల కేఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్సీ తాతా మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీకి గౌరవం లేకుండా తన సీటు ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరుపై మండిపడ్డారు.

**విలీన పంచాయతీలపై దృష్టి: మేయర్**

సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. విలీన పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించామని, విలీన పంచాయతీలకే వార్డు బడ్జెట్ అధికంగా కేటాయించామని అన్నారు. ఆ నిధులను ఆ పంచాయతీల అభివృద్ధికే ఖర్చు చేస్తామని అన్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ముందుగా 43వ వార్డులో పన్నుల రీ అసెస్‌మెంట్ చేయడం ద్వారా రూ.60 లక్షల వరకు ఆదాయం పెరిగిందని అన్నారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, కాంగ్రెస్ కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు మాట్లాడారు. అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట కార్యాచరణ

- సన్న, దొడ్డు రకం ధాన్యం సేకరణకు వేర్వేరు కేంద్రాలు
- ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బంది లేకుండా చూడాలి
- కొనుగోలు సన్నాహక సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మార్చి 25 : జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సన్నాహక సమావేశం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మంగళవారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం సేకరణ జిల్లాలో విజయవంతంగా జరగడం పట్ల అన్ని శాఖల అధికారులను అభినందించారు. రైతులు పండించిన వరి పంట విస్తీర్ణం, కోతల సమయం, కొనుగోలు కేంద్రాలకు ఎప్పుడు పంట తీసుకొస్తారనే అంశంపై వ్యవసాయ శాఖ ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్ రూపొందించాలన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లను వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ మిషన్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్ని సంచులు తదితర మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని నీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు 48 గంటల వ్యవధిలో జమ అయ్యేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ఒకేసారి జరుగుతున్న నేపథ్యంలో రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కనీస మద్దతు ధర తెలిపే కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి.శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీం, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, డీసీవో గంగాధర్ పాల్గొన్నారు.

# 257 దరఖాస్తులు.. ముగ్గురి ఎంపిక!

**లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరిగిందని ధర్నాకు దిగిన దివ్యాంగులు**

**ఉపాధి కల్పన విషయంలో ప్రభుత్వం మోసం చేసిందని తీవ్ర ఆవేదన**



బోనకల్లు-ఖమ్మం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న దివ్యాంగులు

బోనకల్లు, మార్చి 25 : లబ్ధిదారుల ఎంపిక విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఉపాధి కల్పన కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు దివ్యాంగులు రోడ్డెక్కి ధర్నాకు దిగారు. ఈ ఘటన బోనకల్లు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల ఉపాధి కల్పన కోసం ఆర్థిక పునరావాస పథకం కింద అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించింది. మండలవ్యాప్తంగా 257 మంది దరఖాస్తు చేసుకోగా.. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో రమాదేవి, కన్వీనర్ బాలాత్రిపుర సుందరి లాటరీ ద్వారా చేపట్టారు. ముగ్గురిని ఎంపిక చేసినట్లు ప్రకటించిన అధికారులు వారి వివరాలను జిల్లా అధికారులకు పంపిస్తామని, ఇందులో ఒకరికి మాత్రమే ఉపాధి కోసం రూ.50 వేలు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. అక్కడే ఉన్న దివ్యాంగులు 257 మంది దరఖాస్తు చేసుకుంటే .. ముగ్గురిని మాత్రమే ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకే తాము ఎంపిక చేశామని అధికారులు తెలిపారు. దీంతో దివ్యాంగులమైన తమను కూడా ప్రభుత్వం అన్ని విధాల మోసం చేసిందని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తూ బోనకల్లు-ఖమ్మం ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించడంతోపాటు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దివ్యాంగులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ప్రభుత్వం దివ్యాంగుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. కాగా.. దివ్యాంగులకు సీపీఎం మండల కార్యదర్శి కిలారి సురేశ్, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నరేశ్ సంఘీభావం తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని చెప్పారు.

# భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలు

**ఆర్టీసీ కరీంనగర్ ఈడీ కుష్రోషా ఖాన్**



సమీక్షలో మాట్లాడుతున్న కుష్రోషా ఖాన్

భద్రాచలం, మార్చి 25 : శ్రీరామ నవమికి వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) కుష్రోషా ఖాన్ ఆదేశించారు. శ్రీరామ నవమికి బస్సులు నడిపించే అంశంపై భద్రాచలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం వచ్చే ప్రతి భక్తుడు తిరిగి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి సంస్థకు పేరు తేవడంతోపాటు ప్రయాణికుల నుంచి మంచి పేరు సంపాదించాలన్నారు. అలాగే భద్రాచలం-పర్ణశాలకు అధిక సంఖ్యలో బస్సులు నడపాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రూట్లలో ప్రయాణికులు ఇబ్బంది లేకుండా బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఖమ్మం, వరంగల్, కొత్తగూడెం తదితర జిల్లాలకు చెందిన డిపో మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ నీరు



# 'భగీరథ'.. నీరు వృథా..

## పైపులైన్ లీక్ కావడంతో ఎగసిపడుతున్న నీరు

ఇల్లెందు రూరల్, మార్చి 25 : ఇల్లెందు మండలం 2పిట్ తిలక్‌నగర్ ఏరియాలో విద్యుత్ స్తంభాలు వేస్తుండగా మంగళవారం మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో నీరంతా వృథాగా పోతున్నది. దీంతో సమీప ప్రాంతంలోని ప్రజల ఇళ్లలోకి ఆ నీరు చేరడంతో నిత్యావసర వస్తువులు, సామగ్రి తడిసిపోయినట్లు పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలం అసలే నీటి సమస్యతో సతమతమవుతుంటే.. భగీరథ నీరు వృథాగా పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఎక్కడా లీకులు లేకుండా చూసుకోవాలని కోరారు.